క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: మండలంలోని పగిడియాల గ్రామంలో మంగళవారం ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. ఇటీవల మండలానికి కేటాయించిన ఈజీఎస్ నిధుల్లో భాగంగా గ్రామంలో రూ.10లక్షలతో పనులు చేయించనున్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామన్నారు. సీసీ రోడ్లతో పాటు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాలప్ప, రఘురాంరెడ్డి, రాములు, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

ఎంపీడీఓ విశ్వప్రసాద్



నారాయణపూర్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్: విద్యార్థులకు పౌష్టికాహారం తప్పనిసరిగా వడ్డించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణపూర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. అంతకుముందు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం వారికి చదవడం, రాయడం నేర్పించారు. మెరుగైన విద్యా బోధనతోపాటు భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులను సూచించారు. అక్కడ నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. గ్రామంలో 323 కుటుంబాల సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రవి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ మల్లేశం, సంఘం నాయకులు

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఎంఈఓ మల్లేశం తపస్ కేలండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి విలువలను కాపాడటంలో తపస్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు మధుకర్, మహేశ్‌లు, సంఘం జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

దర్గా వద్ద ప్రసాద వితరణ



ప్రసాదం అందిస్తున్న మిలాద్ కమిటీ సభ్యులు

కొడంగల్ రూరల్: అజ్మీర్‌లోని ఖాజాగరిబన్ నవాజ్ గంధోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని మహబూబ్‌సుభాని దర్గా వద్ద మంగళవారం సాయంత్రం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా దర్గాలో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం గౌసన్, హఫిజ్ ఆదిల్, కరీం అశ్రఫీ, సయ్యద్ ఖైరాత్‌అలీ, ఆసిఫ్‌ఖాన్, ఎస్ఎస్‌కె నయీమ్, ఇసాక్‌పాషా పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేయాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, మండల అధ్యక్షుడి డిమాండ్

ధారూరు: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిచేసిన అల్లరిమూకలపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని మంగళవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎం. రమేశ్‌లు డిమాండ్ చేశారు. తమ పార్టీ కార్యాలయంపై అల్లరిమూకలు రాళ్లతో దాడిచేయడం, కోడి గుడ్లు విసరడం అప్రజాస్వామికమన్నారు. ఇది కాంగ్రెస్ నాయకుల పనేనని వారు ఆరోపించారు. ఈ దాడిపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమాధానం చెప్పాలన్నారు.

‘కంది’.. రైతన్న రంది

- అరకొరగా మద్దతు ధర
- రూ.12వేలకు పెంచాలని వేడుకోలు
- తప్పని స్థితిలో దళారులకే అమ్మకాలు
- నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు



చంద్రకల్‌లో కందులను నూర్పిడీ చేస్తున్న రైతులు

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర సరిపోవడంలేదని కంది రైతులు వాపోతున్నారు. కనీసం రూ.12వేలకు పెంచితే బాగుంటుందని వేడుకుంటున్నారు. మండల పరిధిలో ఈ సీజన్‌లో సుమారు 12వేల ఎకరాల్లో కంది సాగు చేశారు. రైతులకు మాత్రం సరైన స్థాయిలో ఆదాయం చేకూరలేదని చెబుతున్నారు. మార్కెట్‌లో సరైన ధర రాకపోవడం ఒకెత్తయితే చాలీచాలని మద్దతు ధరతో వారికి లాభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంతో పోలిస్తే...

గడిచిన మూడేళ్లలో కంది ధర దిగుతూ రావడంతో ఆశలు వదులుకున్నారు. 2022లో తాండూరు మార్కెట్ యార్డులో క్వింటాళ్‌కు రూ.9వేల నుంచి రూ.12వేల వరకు రికార్డు స్థాయిలో ధర పలికింది. 2023లోనూ ధరలు పెరుగుతాయనే నమ్మకంతో 15వేలకుపైగా ఎకరాల్లో సాగు చేశారు. అప్పట్లో కూడా సరైన ధర రాకపోవడంతో నష్టపోయారు. ప్రభుత్వం వారి ఆశలకు గండికొడుతూ క్వింటాల్ కందికి మద్దతు ధర రూ.7200లకు తగ్గించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏదిఏమైనప్పటికీ రైతులను ఆదుకునే విధంగా మద్దతు ఉండాలని చెబుతున్నారు.

కష్టాల సాగు

మండలంలో అధికశాతం రైతులు కందిపంటపై ఆధారపడుతుంటారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు పంట ఏపుగా పెరిగింది. కానీ కాపు దశకు వచ్చేసరికి వర్షాల జాడలేకుండా పోయాయి. దీంతో కందికి ఆశించిన దిగుబడి రాలేదు. మరో వైపు తెగుళ్ల బెడద రైతును కుంగదీసింది. ఎకరాకు రూ.25వేల చొప్పున పెట్టిన పెట్టుబడులు రాలేదు. దీంతో వారు లబోదిబోమంటున్నారు.

తప్పనిస్థితిలో విక్రయాలు

ఈ ఏడాది కందులను బట్టి రూ.7,200లు ధర నిర్ణయించారు. కొంతమంది రైతులు స్థానికంగా దళారులకే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మార్కెట్ వడిదుడుకుల వల్ల గత్యంతరం లేక అమ్మి నష్టాపోతున్నామని చెబుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇప్పటికే పొలాల్లోనే దళారులు కందులను కొనుగోలు చేస్తున్నారు. తప్పనిస్థితిలో అమ్ముకోవలిసి వస్తుందని చెబుతున్నారు.

> **‘మద్దతు’ పెంచాలి**
>
> 
>
> ప్రస్తుతం పండించిన కందికి మద్దతు ధర పెంచాలి. క్వింటాళ్‌కు రూ.12వేలు ప్రకటించాలి. ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టి సాగుచేశాం. కాపు దశలో వర్షాలు లేకపోవడంతో పూర్తిగా దిగుబడి తగ్గింది. చివరకు అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం ఆదుకొని మద్దతు ధర పెంచాలి.
>
> – బసయ్యగౌడ్, రైతు, దౌల్తాబాద్

తాగునీటి బోర్లు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



బోరు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

దుద్యాల్: మండలంలోని సంత్రకుంట తండాలో నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడ్డారు. కొన్నాళ్లుగా గ్రామ పంచాయతీ బోర్లు నిరుపయోగంగా ఉండడంతో తండాలో నీటి కష్టాలు పెరిగాయి. దీంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గ్రామాన్ని సందర్శించిన సాక్షి తాగు నీటికి కటకట అనే కథనాన్ని సోమవారం ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు సోమవారం మిషన్ భగీరథ నీరు సరఫరా చేయడంతో పాటు మంగళవారం గ్రామ పంచాయతీకి చెందిన రెండు బోర్లను మరమ్మతు చేయించారు. దీంతో తండా వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

జాతీయభావాన్ని పెంపొందించుకోవాలి

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి

కుల్కచర్ల: యువకులంతా జాతీయభావాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం ఘణపూర్ గ్రామంలో స్వామి వివేకనంద యువజన వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువకులు నేటి సమాజంలో క్యాష్ గురించి ఆలోచించకుండ మంచి ప్రవర్తనను పెంచుకోవాలన్నారు. మంచి ఆలోచనలు మంచిపనులవైపునకు మొగ్గు చూపుతాయన్నారు. ప్రతిఒక్కరూ ఉన్నత ఆశయాలతో ముందుకుసాగాలన్నారు. వివేకనంద జయంతిని పురస్కరించుకుని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా వారం రోజులపాటు యువజనవారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత ఘణపురం వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మివేణుగోపాల్, నాయకులు వార్ల ఆంజనేయులు, రాములు, రాంచంద్రయ్య, చంద్రలింగం, దండు ఆంజనేయులు, రాజేష్, శ్రీనివాస్, మల్లేశ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎల్‌టీసీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస‌రెడ్డి

కొడంగల్ రూరల్: ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంచేందుకు నిర్వహిస్తున్న శిక్షణకు కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఎం.ప్రవీణ్, ఎం.బహదూర్‌లను ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, అధ్యాపక సిబ్బంది అభినందించారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 30మంది విద్యార్థులను ఎంపిక చేస్తూ నెల రోజులపాటు శిక్షణ అందించనున్నారని వారు తెలిపారు. దీనికి కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికఅవ్వడం అభినందనీయమన్నారు.

కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి
- 26 నుంచి రైతు భరోసా

పరిగి: కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని, ఈ నెల 26 నుంచి రైతు భరోసా అందిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయబోతుండటంతో మంగళవారం పట్టణ కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులకు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలను సంవత్సరం తిరగకముందే అమలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆయూబ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఫ్లోర్ లీడర్‌శీనివాస్, గోపాల్, చిన్న నర్సింహులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

10న వైకుంఠ ఏకాదశి

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీ శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించడానికి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. 13న గోదాదేవి కల్యాణం, 15న కనుమ, ఆండాల్ నీరాటోత్సవం నిర్వహిస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. డిసెంబర్ 16వ తేదీన ప్రారంభమైన ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చదివి వినిపిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో కొడంగల్ ఆలయంలో ధనుర్మాస పూజలు సంప్రదాయంగా వస్తోంది. ఈ ప్రాంత ప్రజల ఇలవేల్పుగా ఉన్న వెంకన్న స్వామి ఆలయంలో ఏకాదశి శుభ గడియలో భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. తిరుపతి నుంచి తెచ్చిన విశేష పూలమాలలతో స్వామివార్లను అలంకరిస్తారు. తిరుచ్చి వాహనంపై దేవేరుల సమేత శ్రీనివాసుడు ఆలయం తూర్పు మహాద్వారం నుంచి భక్తుల దర్శనార్థం తీసుకవస్తారు.

బీజేపీ నేత వాఖ్యలు అభ్యంతరకరం



మాట్లాడుతున్న నేతలు

కుల్కచర్ల: ప్రియాంకగాంధీపై బీజేపీ నేత రమేష్ భిదూరీ చేసిన వాఖ్యలు అభ్యంతరకరమని కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళల పట్ల బీజేపీ నేత వాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని ఇది దేశ మహిళలను కించపరచడమేనన్నారు. అదేవిధంగా పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించడం దేశంలో బీజేపీ నిర్వహిస్తున్న వికృతపాలనకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నక్క నర్సింలు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు పరుగు!

- ఇబ్బందుల్లో తండావాసులు
- పట్టించుకోని అధికారులు



సంత్రకుంట తండాలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

దుద్యాల్: మండల పరిధిలోని సంత్రకుంట తండాలో మురుగు పరుగులు తీస్తుంది. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు లేరు. ముఖ్యంగా కాల్వలు లేకపోవడంతో ఇండ్లనుంచి వెలువడే నీరంతా రోడ్డుపైనే పారుతుంది. ఇళ్ల మధ్య మురుగు పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈగలు, దోమలు వ్యాపించి వ్యాధులు సంక్రమించే అవకాశం లేకపోలేదు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో దోమలు కూడా రాత్రిసమయంలో కుడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని తండా వాసులు కోరుతున్నారు.

పరిగి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రయ్య

దుద్యాల్: గతంలో తహసీల్దార్‌గా పని చేసి ప్రస్తుతం పరిగిలో విధులు నిర్వహిస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బుస్సా చంద్రయ్య డిమాండ్ చేశాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దుద్యాల్ గ్రామానికి చెందిన ఓ భూమి వ్యవహారంలో రైతుకు అన్యాయం చేశాడని ఆరోపించారు. అనంతరం అందుకు సంబంధించిన వివరాలతో వినతి పత్రాన్ని రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. దుద్యాల్ తహసీల్దార్‌గా గతంలో పని చేసి ప్రస్తుతం పరిగిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కింద పడిన విద్యుత్ స్తంభం

నరఫరాకు 3 గంటలు అంతరాయం



పొలం గట్టుపై పడిపోయిన విద్యుత్ స్తంభం

ధారూరు: వ్యవసాయ పొలం గట్టుపై 33 కేవీ విద్యుత్ స్తంభం కింద పడిపోయింది. మంగళవారం ధారూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా దాదాపు 3 గంటల పాటు నిలిచిపోయింది. తాండూర్ నుంచి ధారూరు వరకు వేసిన 33 కేవీ విద్యుత్ లైన్ గట్టెపల్లి గ్రామ సమీపంలో పొలం గట్టుపై ఒరిగి కిందపడింది. పొలంలో వరినారు వేయడానికి కరిగెడ చేస్తున్న రైతు ట్రాక్టర్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి సపోర్టుగా పాతిన మరో స్తంభానికి తగలడంతో కిందపడిపోయాయి. కిందపడ్డ విద్యుత్ స్థంభానికి సిబ్బంది మరమ్మతులు చేశారు. ప్రత్యామ్నయంగా మరో విద్యుత్ లైన్ ద్వారా సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా పునరుద్దరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది

- ప్రిన్సిపాల్ విశ్వనాథం
- ప్రభుత్వ పాఠశాలలో మాక్‌పోలింగ్



సిరా చుక్క వేస్తున్న విద్యార్థిని

అనంతగిరి: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో ముఖ్యమని మద్గుల్ చిట్టంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్‌లోని మద్గుల్ చిట్టంపల్లి ప్రభుత్వ పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థ పట్ల అవగాహన కల్పించడం కోసం నిర్వహించామన్నారు. ప్రతీ ఒక్కరికి ప్రజాస్వామ్యం, ఎన్నికలపై తెలిసిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రాజేందర్, ఫహీం రిజ్వానా, రాములు, చంద్రమౌళి, స్వరూప, విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు



బండవెల్కిచర్లలో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టెన్నిస్, క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలపై నిర్విరామంగా ఆలోచించే లక్ష్మారెడ్డి ఆకస్మిక మరణం తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. బాల్‌రెడ్డి స్మారకార్థం క్రీడలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు స్వామి, గోవర్ధన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

- జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన

చేవెళ్ల: మైనర్లు వాహనాలు నడపకూడదని, రోడ్డు దాటే సమయంలో పాదాచారులు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. పాదాచారులు జీబ్రా క్రాసింగ్ లైన్ వద్దనే రోడ్డు దాటాలని, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ రోడ్డు దాటొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో నడపకూడదని, అలా నడిపితే వాహన యజమానిపై, తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు అవుతుందని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపించే వారు సీటు బెల్టులు వేసుకోవాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులు, ఇతరులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. వీటితో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నప్ప రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ అశోక్, పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు అందజేత

- జిల్లాలో బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఎంపిక
- విద్యారంగాభివృద్ధికి కృషి చేసినవారికి గుర్తింపు
- దోమ ఎంఈఓ వెంకట్‌కు హై బిజ్ టీవీ పురస్కారం



ఉత్తమ పురస్కారాలు అందుకుంటున్న పాఠశాలల ఎంఈఓలు

దోమ: విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు హై బిజ్ టీవీ పురస్కారాలను హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో అందజేశారు. ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డులతో రాష్ట్ర స్థాయిలో పలు పాఠశాలలను ఎంపిక చేసి మంగళవారం ఉత్తమ పుస్కరాలను ప్రదానం చేశారు. దోమ మండలంలోని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల రాష్ట్ర స్థాయిలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసినట్లు గుర్తించి ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక చేసింది. జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం(ఎంఈఓ) వెంకట్‌కు శాంత బయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి ఈ అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా శాంత బయోటెక్ ఎండీ మాట్లాడుతూ భారత దేశ సంస్కృతికి ఎంతటి ప్రాధాన్యం ఇస్తామో, విద్యాలయాలకు కూడా తగిన ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. చదువు-సంస్కృతి అనేవి కవల పిల్లలవంటివన్నారు. తల్లి ఒడిని తొలిబడిగా ఆయన అభివర్ణించారు. అనంతరం ఎంఈఓ వెంకట్ మాట్లాడుతూ..జిల్లాలోనే తమ పాఠశాల రాష్ట్ర స్థాయి ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. పట్టుదలతో ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. జిల్లాలోనే మొదటి స్థానంలో ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చేందుకు విశేష ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.